హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కోడూరు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, సీసీరోడ్లను మంత్రి కాకాణి గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.50 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. గత టీడీపీ హయాంలో శంకుస్థాపనలు చేసి పనులను విస్మరించారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించి చూపిస్తోందన్నారు. ఒక్క కోడూరు పంచాయతీలోనే రూ.100 కోట్లను వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.60.78 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు.

చంద్రబాబు కుయుక్తులతో జాగ్రత్త

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు అనేక కుయుక్తులకు దిగుతున్నాడని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి కాకాణి పేర్కొన్నారు. గతంలో 600 హామీలిచ్చి వేటినీ నెరవేర్చలేకపోయాడన్నారు. ఇంటికో ఉద్యోగం అంటూ విద్యావంతులను, భృతి పేరిట నిరుద్యోగులను, రుణమాఫీ అంటూ మహిళలను, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న బాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నీలమ్మ, స్థానిక నేతలు కావల్‌రెడ్డి రవీంద్రరెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, రావూరు గోపిరెడ్డి, పన్నూరు వేణురెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాల చేరిక

టీడీపీ కంచుకోటగా ఉన్న మల్లికార్జునపురంలో స్థానిక టీడీపీ నేతలు తాళ్లూరు వీరరాఘవులు, తాళ్లూరు కృష్ణలతో కలిసి 25 కుటుంబాలు గురువారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించుకోవడంతో ఆ పార్టీ నుంచి వలసలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ నేతలు చంద్రశేఖర్, ఎల్లసిరి సుబ్బరాగయ్య పాల్గొన్నారు.

పేదల చెంతకు కార్పొరేట్ విద్య



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 250 ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సర్కార్ పాఠశాలలకు కొత్త కళ వచ్చిందన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలును, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులపై చూపుతున్న ఆదరణ గురించి మాట్లాడారు.

పొదుపు మహిళలకు చెక్కుల పంపిణీ

మండలంలోని 20 పొదుపు సంఘాలకు రూ.1.90 కోట్ల రుణాల చెక్కులను ఎమ్మెల్యే ప్రసన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఎల్‌పీఎస్ భూములకు పట్టాల పంపిణీ

గతంలో ఎల్‌పీఎస్ స్కీమ్ కింద ఎస్సీ కార్పొరేషన్ నిరుపేద దళితులకు భూములు పంపిణీ చేసింది. అయితే దీనికి సంబంధించి కొంత నగదు చెల్లించాల్సి ఉంది. దీనిని నిరుపేదలైన దళితులు చెల్లించలేకపోవడంతో ఆ నగదును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించి 210 మంది రైతులకు శాశ్వత భూ హక్కు కల్పించింది. కాగా దీనికి సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే ప్రసన్న లబ్ధిదారులకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి రావు, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్యుత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మయ్య, ఎంపీపీ వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మనుబోలు : మండల కేంద్రంలోని పిడూరు రోడ్డు మార్గంలో ఉన్న సాయినాథుని మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు సాయినాథునికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. పూసం మోహన్‌రెడ్డి, మంగమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అయోధ్య అక్షతలకు గ్రామోత్సవం



కోవూరు : మండలంలోని గంగవరం గ్రామంలో అయోధ్య అక్షతలకు గురువారం గ్రామోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరికీ అక్షతలకు అందించినట్లు తెలిపారు. హైందవ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కరేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పాముూరు గోపాల్‌రెడ్డి, అడపాల శ్రీనివాసులురెడ్డి, కాశీవరపు మల్లికార్జున, వాసిలి వెంకటేశ్వర్లు, గుంటూరు వాసు, ఎడ్ల రామచంద్రారెడ్డి, ఎడ్ల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

నెల్లూరురూరల్: రూరల్ మండలం కోడూరుపాడులో గ్రామదేవత ఊళ్లమ్మతల్లి కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఈ నెల 6న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి తెలిపారు. కోడూరుపాడు సొసైటీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. సుమారు 30 జతల ఎడ్లు బండలాగుడు పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. పోటీల్లో రాణించిన ఎడ్లకు మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి ప్రథమ బహుమతి రూ.50 వేలు, కోడూరు రాజేష్‌రెడ్డి ద్వితీయ బహుమతి, కార్పొరేటర్ జానా నాగరాజు తృతీయ బహుమతి రూ.30 వేలు, ముచ్చుకాయల వేణు నాల్గో బహుమతి రూ.25 వేలు, రామిరెడ్డి రమేష్‌రెడ్డి ఐదో బహుమతి రూ.20 వేలు, తమ్మి శ్రీనివాసులు ఆరో బహుమతి రూ.15 వేలు, మౌలాలి ఏడో బహుమతి రూ.10 వేలు విజేతలకు అందజేయనున్నట్లు వివరించారు.

7న మోపూరు చిత్రపటం ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతి సమాజంలో ఈ నెల 7న ప్రముఖ సాహితీవేత్త, ఆధ్యాత్మిక ప్రవచనకర్త మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య గురువారం తెలిపారు. ఉదయం 10గంటలకు చిత్రపటాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన, సుమతి శతక పద్యాల కంఠస్థ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే సాహితీవేత్తలను సత్కరించనున్నట్లు తెలిపారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (పొగతోట) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఇందుకూరుపేట తాలూకా యూనిట్ టేబుల్ క్యాలెండర్-2024ను జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ సుస్మితారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై రమణారెడ్డి, వై మల్లికార్జున మాట్లాడుతూ తొలిసారిగా తాలూకా స్థాయిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం నారాయణరెడ్డి, జీ రాంబాబు, జిల్లా కోశాధికారి పీవీఎస్ టీ రాంప్రసాద్, తాలూకా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పనుల పురోగతికి తోడ్పడాలి



కొలతలు తీయడంపై మేట్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

- ఏపీడీ శ్రీహరిరెడ్డి

పొదలకూరు : గ్రామాల్లో ఉపాధి మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్లకు సహకరించి పనుల పురోగతికి తోడ్పాటు అందించాలని డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మేట్లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమంలో ఏపీడీ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేట్లు ప్రాథమికంగా కొలతలు, మస్టర్లు తీయడం వంటి పనులను తెలుసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నిరకాల పనుల వద్దకు హాజరు కాలేరని, మేట్ల సహకారం అవసరమవుతుందన్నారు. మేట్లు కూలీలను పనులకు తీసుకురావడంతో పాటు వారికి మస్టర్లు వేయడం, చేసిన పనులకు కొలతలు తీయడం వంటివి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో కొలతలు వేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఏపీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం వెంకటాచలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగే వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను సందర్శిస్తారని తెలియజేశారు.

ముత్తుకూరులో..

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మత్స్యకళాశాలలో జరిగే నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని 4, 10, 17వ వార్డుల్లో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం సీసీరోడ్లను ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. అనంతరం డీఎల్ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఎంపీడీఓ కార్యాలయంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు.

నేటి నుంచి గ్రామసభలు

ఇందుకూరుపేట : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా మొదటి, రెండో విడతలో జరిగిన రీసర్వేపై నేటి నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య గురువారం తెలిపారు. 5వ తేదీన పల్లిపాడు, నిడిముసలి, 6న కొమరిక, సోమరాజుపల్లి, 7న జంగంవానిదొరువు, 8న ఇందుకూరుపేట బిట్-1, 2లు, 9న లేబూరు, పున్నూరు, 10న మైపాడు, పీడీకండ్రిగ గ్రామాల్లో ఈ సభలు జరుగుతాయన్నారు. రీసర్వేకు సంబంధించి సమస్యలు ఉంటే వినతలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కౌన్సిలర్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్ మోర్ల జయంతి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పి.పెంచలయ్య, ఎం.పెంచలయ్య, గౌస్‌బాషా, శేఖరయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆకాష్

కొడవలూరు : ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందుకుంటున్న వృద్ధురాలికి వలంటీర్ పింఛన్ అందజేశారు. మండలంలోని కమ్మపాళేనికి చెందిన సుబ్బమ్మకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఆమె అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ సుబ్బమ్మను ఐసీయూలో ఉంచి అత్యవసర వైద్య సేవలందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వలంటీర్ ఆకాష్ గురువారం నెల్లూరు ఆస్పత్రికి వెళ్లి సుబ్బమ్మకు పింఛన్ అందజేశారు. దీంతో కుటుంబసభ్యులు ఎంతో సంతోషించారు. వలంటీర్ ఆకాష్‌ను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



డ్రెయినేజీలో పూడిక తీత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ప్రమీలమ్మ, వలంటీర్ రజియా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలి, బ్లీచింగ్ చల్లించారు.

మంత్రిని కలిసిన డీఏబీ చైర్మన్



కోవూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి నగదు విరాళం



పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన తుమ్మల శ్రీహరి-అనూరాధ దంపతులు గురువారం రూ.10 వేల నగదు విరాళం అందజేశారు. ఈ నగదును దేవస్థానం ప్రధానార్చకుడు దాతల నుంచి స్వీకరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



ద్విచక్ర వాహనాల అందజేత

ఇందుకూరుపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మత్స్యకార సొసైటీ ద్వారా మండలంలోని కుడితిపాళెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు ద్విచక్ర వాహనాలను(టీవీఎస్ మోపెడ్) సబ్సిడీ ద్వారా అందజేశారు. వీటిని శ్రీనివాసులురెడ్డి గురువారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, వెంకటరామిరెడ్డి, రవి, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

పడుగుపాడులో ఫ్యామిలీ డాక్టర్



రోగి ఇంటికి వెళ్లి పరీక్షిస్తున్న డాక్టర్ నిరంజన్

కోవూరు : మండలంలోని పడుగుపాడు సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ నిరంజన్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. వ్యాయామం చేయడం ద్వారా కొన్నిరకాల రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దార్శనికులు లూయీ బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అంధుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన లూయీ బ్రెయిలీ గొప్ప దార్శనికులు అని ఎంఈఓలు దిలీప్‌కుమార్, వెంకటరత్నం కొనియాడారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ.. అంధుల కోసం ప్రత్యేక లిపిని కనుగొన్న బ్రెయిలీ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆయన కృషితోనే అంధులు చదువుకుని అన్నిరంగాల్లో ప్రతిభ చూపుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎన్నార్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సాబిహా తాజ్, ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, సీహెచ్ శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధంగా అన్నిరకాల ఎరువులు

- ఏడీఏ శివనాయక్



పొదలకూరులో ఎరువుల దుకాణం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

పొదలకూరు : రైతులకు కావల్సిన అన్నిరకాల ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) కె.శివనాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏఓ వాసుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వల రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అన్నిరకాల ఎరువులను విక్రయించాల్సిందిగా డీలర్లకు సూచించారు. ఎరువుల స్టాక్ వివరాలను దుకాణం ముందు బోర్డులో ప్రదర్శించాలని వివరించారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్సులను సస్పెండ్ చేయడం లేదా రద్దు చేయడం చేస్తామన్నారు. రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఎరువు కోసం నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. యూరియాను తగిన మోతాదులో వినియోగించాలని, అధికంగా వాడితే తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని రైతులకు సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

మనుబోలు : ఎక్కడా ఎరువుల కొరత లేదని, కృత్రిమ కొరతను సృష్టించి ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ దుకాణ యజమానులను హెచ్చరించారు. మండలంలోని ఎల్‌ఏ న్‌పురం, కాగితాలపూరు, చెర్లోపల్లి, మనుబోలులోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన గురువారం పరిశీలించారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్బీకేల ద్వారా ఇప్పటివరకు 695.25 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఇంకా సరఫరా చేస్తామని వివరించారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో వీఏఏల వద్ద ముందుగా నమోదు చేసుకుని పొందవచ్చన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న ఎరువుల దుకాణాలను ఏఓ లక్ష్మి గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రిజిస్టర్‌లో ఎరువుల నిల్వలు, వాస్తవ నిల్వలకు వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారులు రోజువారీ విక్రయాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో కూడా పొందవచ్చని తెలిపారు. అయితే కావల్సిన మోతాదును వీఏఏ వద్ద ఒక్క రోజు ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



మనుబోలు : ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న ఏఓ జహీర్



కొడవలూరు : నార్తురాజుపాళెంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి